క్లుప్తంగా

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కదిరి అర్బన్: విద్యార్థులు మాదక ద్రవ్యాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ వీరారెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'మాదక ద్రవ్యాలు, నాటుసారాతో కలిగే దుష్ప్రభావాలు'పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత, ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి 'యువ ఉత్సవ్'


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్: పట్టణంలోని బ్లూమూన్ విద్యాసంస్థలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాస్థాయి యువ ఉత్సవ్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం విద్యాసంస్థల అధినేత శివశంకర్‌తో కలిసి ఆవిష్కరించారు.

యూపీఎస్ సీఐగా శివరాముడు



ముదిగుబ్బ: యూపీఎస్ సీఐగా శివరాముడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కూడేరు నుంచి బదిలీపై ముదిగుబ్బకు వచ్చారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి

పుట్టపర్తి టౌన్: పద్దెనిమిది సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కొత్తచెరువు తహసీల్దార్ నీలకంఠారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం విద్యార్థులు, సిబ్బందితో కలసి కొత్తచెరువులో ర్యాలీ నిర్వహించి.. అనంతరం నెహ్రూ కూడలిలో మనవహారంగా ఏర్పడ్డారు. ఓటు హక్కు, నమోదుపై అవగాహన కల్పించారు.

ఆర్ఎంపీపై విచారణ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రం నిర్వహిస్తున్న ఆర్ఎంపీ ఇందుకూరు బాషాపై జిల్లా అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. దొరిగిల్లు గ్రామానికి చెందిన రమణ అనే వ్యక్తి ఆర్ఎంపీతో ఇంజెక్షన్ వేయించుకున్నాక ఇన్ఫెక్షన్ అయ్యింది. దీంతో బాధితుడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఐఓ నాగేంద్రనాయక్, డాక్టర్ శ్వేత ఆర్ఎంపీ క్లినిక్‌కు వచ్చి విచారణ చేపట్టారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ధర్మవరం రూరల్: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాల్సిన అవసరం ఉందని జిల్లా అంబుడ్స్‌మెన్ అధికారి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నిమ్మలకుంటలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1.20 లక్షలతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా జిల్లా అంబుడ్స్‌మెన్ అధికారి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఓ అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, టీఏ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి జయంత్‌రెడ్డి, ఎఫ్ఏ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమాచార చట్టంపై అవగాహన కల్పించండి


మొక్కలు నాటుతున్న జిల్లా అంబుడ్స్‌మెన్

బత్తలపల్లి: సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం) ప్రజా సంరక్షణ వేదిక సభ్యులు మండల అధికారులను కోరారు. సోమవారం బత్తలపల్లి తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడును కలిసి సమాచార హక్కు చట్టం పోస్టర్లను అందజేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు గోపీ, ధర్మవరం గౌరవాధ్యక్షులు చెన్న ఆదినారాయణ, పట్టణ అధ్యక్షులు కొండప్ప మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియజేశారు.

అన్నీతామై అంత్యక్రియలు

పుట్టపర్తి టౌన్: అనాథలకు, ఆర్థిక స్తోమత లేని వారికి ఖిద్మత్- ఎ-ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ ఆత్మబంధువుగా నిలుస్తోంది. బిహార్ రాష్ట్రానికి చెందిన విజయరామ్ (57) గుండె శస్త్రచికిత్సల కోసం పుట్టపర్తి సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందారు. స్వస్థలానికి తీసుకెళ్లడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఖిద్మత్ ఎఖల్క్ సొసైటీ సభ్యులను ఆశ్రయించారు. కమిటీ సభ్యులు షామీర్, షాకీర్, ఆదిల్, అలీ అన్నీతామై కర్ణాటకనాగేపల్లి శ్మశాన వాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

'సుందరీకరణ' సాగేనా..?

- దేవరచెరువు కట్టపై పార్కు ఏర్పాటుకు చర్యలు
- సుందరీకరణ పనులకు రూ.36 లక్షల నిధుల కేటాయింపు


గత ప్రభుత్వ హయాంలో పార్కు ఏర్పాటుకు చెరువుకట్టపై జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టిన దృశ్యం

కదిరి అర్బన్: దేవరచెరువు కట్టపై పార్కు ఏర్పాటు సుందరీకరణ పనులు ముందుకు సాగడం లేదు. కదిరి పట్టణ వాసులు సేద తీరేందుకు, ఆహ్లాదం పొందేందుకు సరైన పార్కులు లేవు. వైఎస్సార్‌నగర్‌లోని మున్సిపల్ పార్కు చిన్నారులకు కొంత ఊరట కలిగిస్తోంది. లక్ష జనాభా కలిగిన పట్టణంలో ఒక్క పార్కు ఏ మూలకూ సరిపోదు. గత ప్రభుత్వం మరొక పార్కు ఏర్పాటుకు చొరవ చూపింది. గత పదేళ్లుగా సరైన వర్షాలు లేకపోవడంతో దేవరచెరువులో నీరు అంతంత మాత్రంగానే ఉండేది. హంద్రీ–నీవా జలాలతో గత ప్రభుత్వం దేవరచెరువును నింపింది. దీంతో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం సైతం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ప్రాంతం ఎప్పుడూ పర్యాటక ప్రాంతంగా ఉండాలని, చెరువు కట్టపై ఉన్న ఆరు ఎకరాల స్థలంలో పట్టణ ప్రజలకు ఆహ్లాదం కలిగించే పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎంఎస్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.36 లక్షల అంచనా వ్యయంతో సుందరీకరణ చేపట్టాలని కార్యాచరణ రూపొందించింది. అందుకు అనుగుణంగానే జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తయ్యాయి. కట్టపై అందమైన చెట్లు, పూలమొక్కలు, కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు, విద్యుదీకరణ, పశువులు పార్కులోనికి రాకుండా మెష్ ఫినిషింగ్ లాంటి పనులు చేట్టాల్సి ఉంది. పార్కు ఏర్పాటైతే సాయంత్రం వేళ హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రజలు ఎలా సేద తీరుతారో అలాగే ఇక్కడ ఉంటుందని అధికారులు చెపుతున్నారు. అయితే కూటమి సర్కారు వచ్చిన తర్వాత సుందరీకరణ పనులు స్తబ్దుగా ఉన్నాయి. త్వరగా పనులు పూర్తి చేసి పార్కును ప్రారంభించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


నిండుకుండలా దేవరచెరువు

పర్యాటక ప్రదేశం చేయాలి



కదిరి పట్టణానికి దేవరచెరువు ఆనుకుని ఉంది. ఇక్కడ సాయంత్రం వేళ సేద తీరేందుకు పార్కు ఏర్పాటు చేయాలనుకోవడం మంచి నిర్ణయం. అలాగే విద్యార్థులు సెలవు రోజుల్లో పార్కుకు వచ్చి ఆనందంగా గడపవచ్చు. దేవరచెరువును పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దితే చాలా బాగుంటుంది.

– చంద్రశేఖర్, కదిరి

గ్రీనింగ్ కార్పొరేషన్‌కు నివేదిస్తాం



అర్బన్ గ్రీనింగ్ కోసం కదిరిలో తొలుత ఎంపీడీఓ కార్యాలయం వెనుక ఉన్న రాయలచెరువు వివరాలను స్టేట్ అర్బన్ గ్రీనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు అడిగారు. తర్వాత ఏమైందో కానీ పార్కు ఏర్పాటుకు దేవరచెరువు వివరాలు అడిగారు. దేవరచెరువు మైనర్ ఇరిగేషన్ కింద ఉంది. దేవరచెరువు వివరాలను అర్బన్ గ్రీనింగ్‌కార్పొరేషన్‌కు పంపిస్తాం.

– కిరణ్, మున్సిపల్ కమిషనర్, కదిరి

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

కనగానపల్లి: ఎన్డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీలు, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ధర్నా చేపట్టనున్నారు. సోమవారం స్థానిక రైతు సంఘం నాయకులు, వామపక్ష పార్టీలతో కలసి ప్రచారం నిర్వహించారు. రైతాంగం, కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ధర్నాలో అన్ని సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు కదిరప్ప, బాలరాజు, రైతు సంఘం నాయకులు గోవిందు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి పరామర్శ

తలుపుల : ప్రమాదవశాత్తూ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేమలగొంది గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వీరాంజనేయులును సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి సోమవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ఘనంగా అయ్యప్ప అంబలం పూజ

అమడగూరు: బాలప్పగారిపల్లిలో సోమవారం అయ్యప్ప అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున ఉన్న రామాలయం వద్ద గురుస్వామి అభిషేక్ స్వామి ఆధ్వర్యంలో అంబళాన్ని ఏర్పాటు చేశారు. అరటి కొమ్మలతో చేసిన అంబలంలో అయ్యప్ప, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి చిత్రపటాలను ఏర్పాటు చేసి పెద్దఎత్తున భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు.

జీతాలందక గ్రంథాలయ ఉద్యోగుల అగచాట్లు

పుట్టపర్తి టౌన్: గ్రంథాలయ ఉద్యోగులు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థ ద్వారా గ్రంథాలయాలకు రూ.7 కోట్ల సెస్సు అందాల్సి ఉంది. దీంతో అక్టోబర్ నెల జీతాలకు అంతరాయం ఏర్పడిందని గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జయరాయం తెలిపారు. సకాలంలో జీతాలు చెల్లించేందుకు గ్రంథాలయ సంస్థ ఉద్యోగులను 010 పద్దు కిందకు తీసుకరావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆలయంలో నూతన గంటా మంటపం


ఆలయంలో ఏర్పాటు చేసిన గంటా మంటపం, గంట

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం దాతల సహకారంతో నూతన గంటా మంటపంతోపాటు నైవేద్య గంట ప్రతిష్టించారు. ఉదయం నుంచి వేదమంత్రాల నడుమ హోమాలు నిర్వహించారు. అనంతరం 350 కిలోల బరువున్న ఇత్తడి గంటను క్రేన్ సాయంతో అమర్చారు. గంట ఏర్పాటు చేయించిన దాతలు కుంచపు వడ్డే లక్ష్మీప్రసాద్, లక్ష్మీకాంతమ్మ దంపతులతో ప్రత్యేక పూజలు చేయించారు. రూ.5.50 లక్షలు విలువ చేసే ఇత్తడి గంటా మంటపం, గంటను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేషులు, మాజీ చైర్మన్ దాసెట్టి సుబ్రమణ్యం, అన్నమయ్య సేవా మండలి సభ్యులు పొరాళ్ల పుల్లయ్య, అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు, భానుప్రకాష్, చక్రధర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా ముందుకెళ్లాలి


మాట్లాడుతున్న ఆర్డీటీ మహిళా సాధికార డైరెక్టర్ విశాల ఫెర్రర్

కనగానపల్లి: సమాజంలో జరుగుతున్న అకృత్యాలు, హింసను ఎదుర్కొనేందుకు మహిళలు ధైర్యంగా ముందుకెళ్లాలని ఆర్డీటీ మహిళా సాధికార డైరెక్టర్ విశాల ఫెర్రర్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. స్త్రీలపై జరుగుతున్న హింసాత్మక అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళా చట్టాలను ఆర్డీటీ సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఏటీఎల్ పద్మావతి, ఆర్డీటీ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

ఓడీచెరువు : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీటీ కదిరి రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రం ఓడీచెరువులో సోమవారం స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విద్య, ఉద్యోగ రంగాలతో పాటు సామాజికంగా అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో నల్లమాడ ఏటీఎల్ వన్నూరప్ప, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఎంఈఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు

నైపుణ్యాభివృద్ధి సాధించాలి


అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్

బత్తలపల్లి: విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి సాధించినప్పుడే రాణించగలరని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. సోమవారం సంజీవపురం వద్దనున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో రూ.74.84 లక్షల వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఎస్ఓ గుల్జార్ బేగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పించడం కోసం రూ.18.50 లక్షలతో కంప్యూటర్ గది నిర్మాణం, రూ.23.10 లక్షలతో లైబ్రరీ గది నిర్మాణం, రూ.18.50లక్షలతో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ గది నిర్మాణం, మరమ్మతుల కోసం రూ.3.87లక్షలు, ప్రహరీ నిర్మాణం కోసం రూ.10.87 లక్షలు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. చదువుకున్న ప్రతి విద్యార్థికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వలేరని, నైపుణ్యం కలిగిన వారు వివిధ రంగాల్లో రాణించవచ్చని తెలిపారు. విద్యార్థులు విజ్ఞానవంతులైతే కుటుంబంతో పాటు దేశం అభివృద్ధి చెందగలదన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, సమగ్ర శిక్ష బాలికా సంరక్షణ అధికారి (జీసీడీఓ) సంపూర్ణ, డీఈఈ చిదంబరప్ప, తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏఈ నూర్ అఫ్రోజ్, ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్, వైద్యాధికారి తేజశ్రీ, ఎస్ఎంసీ చైర్మన్ ముంతాజ్‌బేగంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పంట పెట్టనీయడం లేదని నిరసన


కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న రైతులు

కదిరి టౌన్: తమ అనుభవంలో ఉన్న భూముల్లో పంట పెట్టకుండా చాకిరేవు గంగులప్ప అడ్డు తగులుతున్నాడని పలువురు రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సర్వేనంబర్ 128లోని 12.15 ఎకరాల్లో ఏడుగురు రైతులకు హక్కు ఉందన్నారు. ఇందులో గంగులప్ప తల్లిదండ్రులు చాకలి నారాయణమ్మ, చాకలి కేసన్న పేరిట 75 సెంట్ల భూమి ఉందన్నారు. సమ్ సట్టంలో ఉన్న మిగతా 11.40 ఎకరాలపై పఠాన్ షబాన్, జిలాన్, నౌషాద్, గౌస్ మోదీన్, రేష్మా,బాబాజాన్ హక్కు కలిగి ఉన్నారన్నారు. అయితే గంగులప్ప ఐదేళ్ల నుంచి తమ ఆరుగురిని పంట పెట్టకుండా అడ్డు తగులుతూ హింసిస్తున్నాడని ఆరోపించారు. తామంతా దయ తలచి మరో మూడు సెంట్లు అదనంగా గంగులప్పకు కేటాయించినా సంతృప్తి చెందక.. ఏదో ఒక సాకుతో ఇబ్బంది పెడుతున్నాడన్నారు. సైకోలా ప్రవర్తిస్తున్న గంగులప్ప నుంచి శాశ్వత విముక్తి కల్పించి.. పంట సాగుకు అవకాశం కల్పించాలని తహసీల్దార్‌ను వేడుకున్నారు.

సంక్షిప్త సమాచారం

ఆకర్షణతో జీవితాలు ఛిన్నాభిన్నం

ధర్మవరం అర్బన్: విద్యార్థినులు ఆకర్షణకులోనై జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని వారి నమ్మకాన్ని, మీ బంగారు భవిష్యత్తును, ఆశయాలను నాశనం చేసుకోకూడదని విద్యార్థినులకు సూచించారు. ఆకతాయిలు, అపరిచిత వ్యక్తులు ఎవరైనా అల్లర్లు చేసినా, మీవెంట పడుతూ ఏడిపిస్తున్నా వెంటనే 100కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మహాలక్ష్మి, సీనియర్ పాత్రికేయుడు పతకమూరి నాగభూషణం, ఏఎస్ఐ కేతన్న, విద్యార్థినులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు పెద్దపీట

ధర్మవరం అర్బన్: పట్టణంలో పారిశుధ్యం మెరుగునకు పెద్ద పీట వేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. పట్టణంలోని శివానగర్‌లో సోమవారం ప్రధాన కాలువల పూడిక తీత కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. మంత్రి కాలువలోని పూడికను తీశారు. అనంతరం ఆయన పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.62.68కోట్ల నిధులతో అమృత్ ఫేజ్–1, అమృత్ ఫేజ్–2 కింద పనులను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, పారిశుద్ధ్య కార్మికులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాశాలలో 'సాఫ్ట్‌వేర్' కోర్సులు

పుట్టపర్తి: బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు ప్రిన్సిపాల్ మక్బుల్ హుస్సేన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు సైతం ఈ కోర్సులు చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ (7981541994)ను సంప్రదించాలని సూచించారు.

మహిళకు తీవ్రగాయాలు

తనకల్లు: కొర్తికోటకు చెందిన గుల్జార్ అనే మహిళ అన్నమయ్య జిల్లా మొలకలచెరువు నుంచి భర్తతో కలిసి ద్విచక్రవాహనంలో సోమవారం స్వగ్రామానికి వస్తుండగా గంగసానివారిపల్లి వద్ద ప్రమాదానికి గురైంది. చీరకొంగు వెనుకచక్రంలో చిక్కుకుని కిందపడడంతో గుల్జార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో తనకల్లులో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వరిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: పోట్లమర్రి గ్రామంలోని సర్వే నంబర్ 327–6లో బిల్లే నాగరాజు సాగు చేసిన వరిలో పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. 12.5 కిలోలల దిగుబడి వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వీఎస్ఏ ముత్యాలప్ప, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ చంద్రమోహన్, మనోజ్, మంజునాథ పాల్గొన్నారు.

హక్కులు– బాధ్యతలపై అవగాహన

ధర్మవరం అర్బన్: రాజ్యాంగ హక్కులు – బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం శైలజ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు సునిత విద్యార్థులతో నమూనాలను తయారు చేయించి ప్రదర్శించారు.

ఎనుములపల్లి విద్యార్థుల ప్రతిభ

పుట్టపర్తి అర్బన్: ఈ ఏడాది రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎనుములపల్లి విద్యార్థులు 8 మంది పాల్గొని ప్రతిభ చూపారు. అండర్–19 బాలికల విభాగంలో స్నేహ, స్వరూప, నందిని, హర్షిత, బాలుర విభాగంలో సాయి చంద్ర ప్రతిభ చూపిన వారిలో ఉన్నారని హెచ్ఎం సుధాకర్, పీడీ రమేష్‌బాబు తెలిపారు. అండర్ –17 బాలుర విభాగంలో కౌశిక్‌రెడ్డి, బాలికల విభాగంలో విజయ ఉన్నారు. అండర్–14 బాలికల విభాగంలో గౌతమి సత్తా చాటిందన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ప్రశాంతి నిలయం: తమ సమస్యలను పరిష్కరించాలని స్కూల్ శానిటేసన్, కంటింజెంట్ ఆయాలు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. వీరికి సిఐటీయూ నాయకులు మద్దతు పలికి, నిరసనలో పాల్గొంది. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ, సాంబశివ, కార్మిక సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాతో సంక్షేమ పథకాలు

తాడిమర్రి: పోస్టాఫీసుల్లో ఐపీపీబీ పొదుపు ఖాతాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని పోస్టుమాస్టర్ చాంద్‌బాషా పేర్కొన్నారు. కార్యాలయం సిబ్బందితో కలసి సోమవారం ఆయన తాడిమర్రిలో అవగాహన కల్పించారు.

తల్లిని ప్రేమించే కుటుంబంలో హింసకు తావుండదు


బత్తలపల్లిలో మాట్లాడుతున్న న్యాయవాది బాలత్రిపుర సుందరి

బత్తలపల్లి: 'ప్రకృతి ఒడిలాంటిది తల్లి ఒడి. ప్రకృతిని ప్రేమించేవారు తల్లిని కూడా ప్రేమిస్తారు. అమ్మను గౌరవించే కుటుంబంలో హింసకు తావుండదు' అని ధర్మవరం కోర్టు న్యాయవాది బాలత్రిపుర సుందరి పేర్కొన్నారు. సోమవారం బత్తలపల్లి ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో 'అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినం' ఘనంగా నిర్వహించారు. ఎస్ఏటీ లీడర్ నారాయణమ్మ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా బాలత్రిపుర సుందరి, ఉమెన్స్ కోఆపరేటివ్ మెంబర్ రాధ, మీ సేవ హరికృష్ణ, గంటాపురం అమృత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీహింస నిర్మూలను ప్రతి ఒక్కరూ ముందడుగు వేద్దామన్నారు. ఆడ పిల్ల పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు హింసకు గురవుతుందని వివరించారు. అందరూ కలిసికట్టుగా పోరాడితేనే స్త్రీ హింస నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఇందుకు ముఖ్యంగా విలువలతో కూడుకున్న జీవితం ముఖ్యమన్నారు. మగవారు మాత్రమే హింసకు కారణం కాదని, స్త్రీలు కూడా కారణమేనని వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏటీఎల్ రుక్మాంగద, రీజనల్ ఇంజనీర్ మధు, కౌన్సిలర్ శోభారాణి, సీఓలు నాగరాజు, వెంకటేష్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అసమానతల వల్లే స్త్రీలపై హింస

గాండ్లపెంట: సమాజంలో స్త్రీ, పురుషుల అసమానత వల్లే అధిక శాతం మంది మహిళలు హింసకు గురవుతున్నారని వక్తలు తెలిపారు. గాండ్లపెంట ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో ఎంఈఓ కృష్ణానాయక్, సీడీపీఓ గంగరత్నమ్మ అధ్యక్షతన సోమవారం అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలనా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై హింసను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యక్షంగా మహిళలు ఎదుర్కొనే హింస గురించి సుమలత, బాలకృష్ణనాయక్ ప్రదర్శించిన నాటకం అందరినీ ఆకట్టుకుంది. సమావేశంలో ఏటీఎల్ బాషా, ఎస్‌టీఎల్ ప్రతాపరెడ్డి, కౌన్సిలర్ సీతమ్మ, సీఓ గంగాధర్, సంస్థ సీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

స్త్రీ హింసను నిర్మూలించాలి

అమడగూరు: సమాజంలోని స్త్రీలపై జరుగుతున్న హింసను పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ వెంకటనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం అమడగూరులో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. మహిళలపై నేరాలకు పాల్పడితే ఎటువంటి శిక్షలు ఉంటాయో ఎస్ఐ వివరించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఏటీఎల్ మధుసూదన్, సిబ్బంది ఆనంద్, వెంకటేష్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలకు ప్రత్యేక గౌరవమివ్వాలి

నల్లచెరువు: మొటుకుపల్లి ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో ఏటీఎల్ సుకన్య అధ్యక్షతన అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎస్ఐ మక్బూల్ బాషా మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీలకు ప్రత్యేక గౌరవం ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబంలో భార్యా భర్తలు గొడవలు పడకుండా ఒకరికొకరు అర్థం చేసుకొని గౌరవప్రదంగా, సమానంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు.

ప్రతిధ్వనించిన శివనామస్మరణ


పోట్లమర్రిలో విశేష పూజలందుకుంటున్న మల్లేశ్వరుడు

తాడిమర్రి/ కదిరిటౌన్/ బత్తలపల్లి: కార్తీకమాస చివరి సోమవారం శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. తాడిమర్రి మండలం చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కదిరిలోని శివాలయం, సైదాపురం శివాలయం, మరకత మహాలక్ష్మి ఆలయం, ఖాద్రీ ఆలయ అనుబంధ ఉమామహేశ్వర ఆలయ పరిసరాలు శివనామ స్మరణతో ప్రతిధ్వనించాయి. ఇక బత్తలపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంగమేశ్వరక్షేత్రం, కాటి కోటేశ్వరక్షేత్రంతో పాటు బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుని ఆలయం, పోట్లమర్రి, ముష్టూరులోని శివాలయాలు, డి.చెర్లోపల్లిలోని సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయంలో భక్తుల తాకిడి పెరిగింది. బత్తలపల్లి ఓంకారేశ్వరుని ఆలయంలో సహస్ర లింగార్చన అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీపంతో పాటు ఆలయ ప్రాంగణాల్లో మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.


కాటికోటేశ్వర క్షేత్రంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


కదిరిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220717, 9912220727, 9912220726, 9010593486